ప్రజాశక్తి

ఆదివారం 1 జనవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఉత్సాహంగా...ఉల్లాసంగా..



- జోరుగా నూతన సంవత్సర వేడుకలు
- దుకాణాలు, వ్యాపార సంస్థలు కిటకిట
- విద్యా సంస్థలు, హోటళ్లు, కార్యాలయాల్లో సందడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నూతన సంవత్సర వేడుకలు శనివారం సాయంత్రం నుంచి ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. శనివారం అర్ధరాత్రి దాటే వరకు వేడుకలు కొనసాగాయి. గత రెండేళ్ళుగా కరోనా తీవ్రత వల్ల వేడుకలు సాదాసీదాగా జరగ్గా ఈ ఏడాది యువత ఉత్సాహంగా ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రహదా రులన్నీ కిటకిటలాడాయి. నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. కేకులు, స్వీట్స్, పండ్లు, బహుమతులు, బొకేలు, విక్రయాలు భారీగా జరిగాయి. గుంటూరుతో పాటు నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, తెనాలి, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి తదితర పట్టణాల్లో కూడా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారులు కొనుగోలు దారులను ఆకర్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా బేకరీలు, బొకేలు, పూలు, పండ్ల, వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఈ దుకాణాలు వెలిశాయి. విఐపిలకు పూలదండలు, పండ్లు ,మిఠాయిలు ఇచ్చేందుకు ఉద్యోగులు, వివిధ సంస్థల నిర్వహాకులు క్యూ కట్టారు. రహదారుల పక్కన మిఠాయిలు, కేకులు, కూల్‌డ్రింక్స్, పండ్లు, ఫలాలు, బొకేలు, పూలదండలు విక్రయించే స్టాల్స్‌కి సాయంత్రం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. విద్యా సంస్థలు, వాణిజ్యసంస్థలు,ప్రభుత్వ,ప్రయివేటు కార్యాలయాల్లో ముందస్తుగానే నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనవరి ఒకటి ఈ ఏడాది ఆదివారం రావడంతో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారమే వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనే వారు ఎక్కువ మంది మాస్కులు ధరించినా ఇతర జాగ్రత్తలను విస్మరించారు. ప్రధానంగా భౌతిక దూరంలేకుండా వేడుకల్లో చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా పలు సంస్థల్లో పాల్గొన్నారు. రాత్రి 9 గంటల నుంచి పోలీసులు రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు తమ సహచర అధికారులు, సిబ్బందితో కలసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యా సంస్థలు, హోటళ్లు, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిలలో ప్రార్థనల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, చర్చిలు, ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. యువత అదుపు తప్పకుండా పోలీసులు కూడలి ప్రదేశాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. పెట్రోలింగ్ నిర్వహించారు. మహిళలు, యువతుల రంగవల్లులతో ఆలంకరణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, యువతులు రాత్రి 12 గంటల వరకూ ముగ్గులు, నివాసాల ఆలంకరణలో నిమగ్నం అయ్యారు. మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్‌లకు మరో గంట సమయం పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. మద్యం దుకాణాలను రాత్రి 11 నుంచి 12 గంటలవరకు, బార్లు, రెస్టారెంట్లు అర్ధరాత్రి ఒంటి గంటవరకు అనుమతి ఇవ్వడంతో జిల్లాలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి.



గుంటూరులో ర్యాలీ

కార్మిక ద్రోహి మోడీ

- సిఐటియు కార్మిక చైతన్య జాతాలో నాయకులు
- పల్నాడు, గుంటూరు జిల్లాలో జాతాకు ఘన స్వాగతం



పల్నాడు జిల్లా నరసరావుపేటలో ర్యాలీ

నాన్నా.. అమ్మని చంపొద్దు...

- కాళ్లు పట్టుకొని బతిమలాడినా ఆగని తండ్రి
- బండరాయితో భార్యతలపై మోది హత్య

3 లో

నకిలీ స్టాంపుల కేసులో ముగ్గురు అరెస్టు

2లో

అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

ధాన్యం కొనుగోలుపై తీరు మారాలి

పలు గ్రామాల్లో పర్యటించిన కౌలు రైతు సంఘం బృందం

ప్రజాశక్తి - తెనాలి

ధాన్యం కొనుగోలులో అధికారులు చెప్పిన మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. శనివారం కౌలు రైతు సంఘం తెనాలి డివిజన్ నాయకుల బృందంతో కలిసి ఆయన అయితానగర్, నేలపాడు, తేలప్రోలు గ్రామాలలో పర్యటించారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎన్టీఆర్ కృష్ణాజిల్లా, పల్నాడు జిల్లాలలో చేసిన కనీస ఏర్పాట్లు కూడా గుంటూరు జిల్లాలో లేవన్నారు. ఆర్‌బికె సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రైతులు ఆర్‌బికెల్లో విక్రయించటం కంటే బయట మార్కెట్‌వైపు మొగ్గు చూపే పరిస్థితిని ప్రభుత్వమే పరోక్షంగా కల్పిస్తుందని విమర్శించారు. ఫలితంగా క్వింటాల్ ధాన్యానికి దాదాపు రూ.2040



పొలంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

రావాల్సి ఉంటే రైతు రూ.500 పైగా నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతాడాది ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా ఖర్చులు, కాటా కూలి, బస్తాలకు సంబంధించిన సొమ్ము ఇంతవరకు రైతులకు అందలేదన్నారు. పలుమార్లు స్పందన లో రైతులు జిల్లా కలెక్టర్‌నకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం

2 లో

అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఇక ఈ ఏడాది ధాన్యం కొనుగోలును పరిశీలిస్తే ఆర్‌బికెల్లో కనీసం గోతాలు కూడా లేవన్నారు. గతంలో రైతులకు సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలను అందించే వారిని, ప్రస్తుతం అవి కూడా అందుబాటులో లేకపోవడంతో దాదాపు రూ.1500 నుంచి రూ2వేల వరకు వెచ్చించి పట్టాలు కొనుగోలు చేయాల్సిన భారం రైతుపై పడుతుందన్నారు. ఈ క్రాప్ నమోదులో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కార్యాలయాలలో కూర్చుని పంట నమోదు చేయడంతో ప్రస్తుతం దిగుబడి వచ్చిన ధాన్యానికి ఈ క్రాప్ లో నమోదుకు వ్యత్యాసం ఉందని, దాంతో రైతులు సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అలాగే మరి కొంతమంది రైతులకు సంబంధించి ఈక్రాప్ నమోదు కాలేదన్నారు. అయితే గ్రామస్థాయిలో వీఆర్వో, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సహకారంతో ఈ క్రాపింగ్ నమోదు లేకపోయినప్పటికీ పంట విక్రయానికి అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దష్టిలో ఉంచుకొని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులు నష్టపోకుండా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి నగదును వారంలోగా రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ములకా శివసాంబిరెడ్డి, ఎం సాంబశివరావు, వేమూరి లక్ష్మీనారాయణ, జి హరిబాబు ఉన్నారు.



స్వీపింగ్ మెషిన్లు ప్రారంభించిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు నిర్వహించటం జరుగుతుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరులో స్వీపింగ్ కొరకు జిఎంసి రూ.42 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మెషిన్లను జిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీటి వల్ల గుంటూరులో త్వరితగతిన పారిశుధ్య పనులు నిర్వహించుటకు అవకాశం ఉంటుందన్నారు. గుంటూరు నగరం విస్తీర్ణం కూడా పెరిగినందున ఇటువంటి ఆదునిక పరికరాలతో పారిశుధ్య పనులు నిర్వహించడం ఎంతో ఉపయోగం ఉంటుందని తెలియచేశారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.



విజేతలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు: విజేతలుగా నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకోని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎం. హుస్సేన్ అన్నారు. శనివారం కళ్ళం ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా యం.హుస్సేన్, ఎ.విజయరత్నం విద్యార్థులకు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గురించి వివరించారు. విద్యార్థులు ఇతరులతో పోల్చుకోకుండా విజయం సాధించిన వారిని ఆదర్శంగా తీసుకొని, తమకి నచ్చిన రంగంలో ఉన్నత స్థానానికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ యం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బిరెడ్డి, డీన్ డాక్టర్ యస్.సూర్యనారాయణ, విభాగాధిపతులు, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.యల్.మాధవరావు, డాక్టర్.బిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ స్టాంపుల కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-వినుకొండ

భూ యజమానుల పేరుపై నకిలీ పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు తయారు చేసుకొని ప్రభుత్వ అధికారుల స్టాంపులతో భూములు అమ్ముకునే ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వినుకొండ పట్టణ సీఐ అశోక్ బాబు తెలిపారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని జాలలపాలెంకు చెందిన సురభి వెంకటేశ్వర్లు, పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన బత్తుల లక్ష్మీనారాయణ, గుంటూరుకు చెందిన ఓర్చు శ్రీనులు పట్టాదారు పాస్ పుస్తకాలు నకిలీ ఆధార్ కార్డును సృష్టించి మోసాలు చేస్తున్నారు. పట్టణానికి చెందిన నేరెళ్ల వెంకట పాపారావుకు చెందిన వెంకుపాలెంలో గల 6.75 ఎకరాల భూమిని, పట్టణానికి చెందిన దేరంగుల శ్రీనివాసరావు, కుందనపు సూర్యనారాయణకు విక్రయ అగ్రిమెంట్ రాసి వారి నుండి రూ. 8,10,000లను తీసుకున్నట్లు తెలిపారు. నేరెళ్ల పాపారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నిందితులు ముగ్గురిని వెల్లటూరు రోడ్లో ఉదయం 9 గంటలకు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. వారి వద్ద నుండి రెండు పట్టాదారు పాస్ పుస్తకాలు, నకిలీ ఆధార్ కార్డు, మూడు ప్రభుత్వ అధికారుల స్టాంపులు, అగ్రిమెంట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు.



మాట్లాడుతున్న పట్టణ సిఐ అశోక్‌బాబు

డిఎస్‌పి ఆఫీసులో ఆకస్మిక తనిఖీ

- విద్యాసంస్థల వద్ద నిఘా ఉంచండి
- జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు దక్షిణ మండల సబ్ డివిజన్ కార్యాలయాన్ని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎస్పి జెస్సి ప్రశాంతిని ఆదేశించారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ యొక్క పనితీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించి మండలంలోని గ్రామాలలో ఇన్ఫార్మర్ల ద్వారా ముందస్తు సమాచారం తెలుసుకొని, ఆయా గ్రామాలలో ఎదైనా సంఘటన జరిగితే వెంటనే చర్యలు తీసుకునే విధంగా అప్రమత్తంగా ఉండాలని భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సైలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతిరోజు అన్ని పోలీస్ స్టేషన్ రౌడీషీటర్ల, సస్పెక్ట్ కలిగిన వారిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని వారి కదలికలపై నిఘా ఉంచాలని, రాత్రి సమయంలో నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ముందస్తు సమాచారం తెలుసుకొని శాంతి భద్రతలను అదుపులో ఉండేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యా సంస్థల వద్ద నిఘా ఉంచాలన్నారు. డిఎస్‌పి జెస్సీ ప్రశాంతి, ప్రత్తిపాడు సుబ్బారావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాకు సహకరించాలి

కృష్ణాజిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పి.జాషువా

పజాశక్తి-కలెక్టరేట్ (కష్ణా)

వివిధ ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు సకాలంలో రుణాలను మంజూరు చేస్తూ బ్యాంకర్లు జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను కోరారు. శనివారం ఆయన స్పందన సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ కన్జల్టేటివ్ కమిటీ సమీక్ష సమావేశంలో పాల్గొని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరు పురోగతిపై బ్యాంకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రుణాలు లబ్దిదారులకు సకాలంలో అందే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు రుణాలను అందిస్తూ వారి అభివద్ధికి చేయూత నివ్వాలన్నారు. గృహ, వ్యవసాయ పంట రుణాలు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, స్వయం సహాయక సంఘాలు, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పోగ్రాం, సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు వెంటనే మంజూరు అయ్యేలా చూడాలన్నారు. ఆయా బ్యాంకుల వద్ద ఉండిపోయిన లబ్దిదారుల పెండింగ్ ధరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జగనన్న తోడు పథకం క్రింద రుణం పొంది 10 నెలల లోపే సక్రమంగా చెల్లించిన వారికి రెండో దఫా రూ.11 వేలు రుణం మంజూరు అయ్యే విధంగా చూడాలన్నారు. జగనన్న ఇళ్లు, టిడ్కో గహాలకు రుణాల మంజూరును వేగవంతం చేయాలనానరు. ఈనెల ఏడో తేదీ కల్లా ఆయా రుణాల మంజూరుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయలన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఎస్ఐడీడీ, ఆర్‌బీఐ, ఎపీ రీజనల్ ఆఫీసర్ ఆర్.కె.హనుమకుమారి, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సుధారాణి, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ వి.వి. ఫణిరామ్ కుమార్, ఎల్డీఎం సాయిరామ్, టిడ్కో పివో బి.చిన్నోడు, ఇండస్ట్రీస్ జిఎం వెంకట్రావు, డిఆర్డీఎ పీడీ ప్రసాద్, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

'ఆస్తి పన్ను' వసూళ్లలో గుంటూరుకు అగ్రస్థానం

ఒకే రోజు రూ.5.25 కోట్లు వసూలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ 2022-23 రెండో అర్ద సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. శనివారం ఒక్కరోజే రూ.5.25 కోట్లు వసూలు చేశారు. గత ఏడాది డిసెంబరు 30,31తేదీల్లో రూ.3.27 కోట్లు మాత్రమే వసూలు చేయగా ఈ ఏడాది ఏకంగా 31వ తేదీ నాటికి రూ.5.25 కోట్లు వసూలు చేసి రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల కన్నా గుంటూరు మొదటిస్థానాన్ని పొందింది. అలాగే 30,31వ తేదీల్లో రెండురోజులు కలిపి రూ.7.20 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించారు. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో పన్నుల చెల్లింపునకు ఏర్పాటు చేసిన కౌంటర్లు రాత్రి 9 గంటల వరకుపనిచేశాయి. గుంటూరు తరువాత స్థానం రూ.1.97 కోట్ల వసూలు చేసి విశాఖపట్నం రెండో స్థానంలో నిలిచింది. జనవరి ఒకటి తరువాత చెల్లించిన వారికి రూ.100కి రూ.2 అపరాధ రుసుము చెల్లిస్తామని విస్తృత ప్రచారంచేయడంతో ప్రజలు వేగంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించారు. గుంటూరులో 1,86,731 అసైన్‌మెంట్స్ ఉండగా రూ.136.15 కోట్ల వసూలు చేయాల్సి ఉండగా శనివారంవరకు రూ. 73 కోట్లు వసూలు చేశామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మొత్తం డిమాండ్ లక్ష్యంలో రూ.34 కోట్ల పాతబకాయిలు ఉండగా మొత్తంగా రూ.73కోట్లు వసూలు చేశామన్నారు. పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా మంచి ఫలితాలు సాధించామని, పన్ను వసూళ్లకు కృషి చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో గుంటూరు ఉండేలా కృషి చేసిన రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు,అడ్మిన్ కార్యదర్శులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు.

చిన్న ,మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల క్రింద పరిశ్రమలకు అందిస్తున్న పోత్సహకాలు అందిపుచ్చుకుని పరిశ్రమలు స్థాపించి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు.డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. జిల్లాలో నూతనంగా స్థాపించిన పరిశ్రమలకు అనుమతులు ప్రోత్సహకాలు మంజూరు సంబంధిత అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. బందరు పోర్టు అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మరో వైపు అంతర్జాతీయ విమానాశ్రయం కలిగి ఉన్న జిల్లాలో ఎగుమతులు దిగుమతులకు చక్కని అవకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల క్రింద రాయితీలు ప్రోత్సహాలతో పాటు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. చిన్న మధ్యతరహ పరిశ్రమలు స్థాపించేందుకు జిల్లాలో ధరఖాస్తు చేసుకున్న 32 మందికి పెట్టుబడి సబ్సిడి క్రింద రూ.2.88 కోట్లు, పవర్ సబ్సిడీ, సేల్స్ ట్యాక్స్ సబ్సిడీ క్రింద రూ.9 లక్షలు మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది.ప్రధాన మంత్రి ఎంప్లాయింమెంట్ గ్యారంటీ పథకం క్రింద 2022-23లో 63 యూనిట్లకు రూ.3.06 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించగా వాటిల్లో 35 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, మరో 24 మంది లబ్దిదారులకు పరివర్తన్ ప్రొగ్రాం క్రింద బ్యాంకు రుణాలు అందించేందుకు, ప్రత్యామ్నయ జీవనోపాధి యూనిట్లు ఏర్పరచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కమిటీ సభ్యులతో కలసి కలెక్టర్ కేక్ కట్ చేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఆర్. వెంకట్రావు సభకు నివేదిక సమర్పించగా, ఎపి ఎంఎస్ఎంఈ డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి. వరలక్ష్మి, ఎపి ఐఐసి జన్ఎం కె.ఎస్. సీతారామ్, ముడా విసి బి. శివనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడుకు కనబడటంలేదని ఫిర్యాదు



బి. నవీన్

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్ :తన కొడుకు కనబటలేదని పొన్నూరు పట్టణం 8వ వార్డు, నార్త్ కాబినపేట్‌కు చెందిన బోడుగు వెంకట స్వరమ్మ భర్త కోటేశ్వరరావుల కుమారుడు బడుగు నవీన్ (35) ఈ నెల 27 నుంచి అదృశ్యం అయినట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 27వ తేది తెల్లవారుజాము 5 గంటలకు తన ఇంటి వద్ద నుండి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బందు వులను, చుట్టుపక్కల గ్రామాలు వెతికి నా ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశ్శారు. ఎస్సై షేక్. హాషీమ్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసి నవారు తెలియజేయాలని కోరారు.

నాన్నా.. అమ్మని చంపొద్దు...

- కాళ్లు పట్టుకొని బతిమలాడినా ఆగని తండ్రి
- బండరాయితో భార్యతలపై మోది హత్య



ఆస్పత్రిలో మృతురాలు అంజమ్మ



అనాధలైన చిన్నారులు



అంజమ్మ (ఫైల్)

ప్రజాశక్తి - మాచర్ల

నాన్నా అమ్మని చంపొద్దు..అంటూ తన పిల్లలు కాళ్లమీద పడి బతిమిలాడినా మద్యం మత్తులో భార్యను బండరాయితో తలపై మోది దారుణంగా హత్య చేసిన సంఘటన శనివారం మాచర్ల పట్టణంలోని జయంతి నగర్ కాలనీ సమీపంలో జరిగింది. బాదితుల కథనం ప్రకారం నెహ్రు నగర్ ఒకటవ లైన్ చెంచు కాలనీ వద్ద నివాసం ఉంటున్న పల్లెబోయిన లక్ష్మయ్య, అంజమ్మలకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. లక్ష్మయ్య అంజమ్మలిద్దరూ గృహ నిర్మాణ పనులకు కూలీలుగా వెళుతుంటారు. లక్ష్మయ్య మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడుతూ ఉంటాడు. ఒకటి రెండు సార్లు చంపేందుకు కూడా ప్రయత్నించినట్లు బంధువులు తెలిపారు. అంజలి తల్లిదండ్రులు కూడా వారు ఉండే నివాసానికి సమీపంలోనే ఉంటారు. ఈ మధ్యకాలంలో లక్ష్మయ్య తాగి భార్యపై గొడవ పడడంతో అంజలి పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చి ఉంటుంది. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని జయంతి నగర్ కాలనీ సమీపంలో ఉన్న తమ పాత ఇంటి వద్దకు పిల్లల్ని తీసుకొని అంజలి వెళ్ళగా అనుసరిస్తూ వెళ్లిన లక్ష్మయ్య నిర్జన ప్రదేశంలో ఆమెపై దాడి చేసి బండరాయితో తలపై మోధి పరారయ్యాడు. పిల్లలు ఇద్దరు అమ్మని చంపొద్దు అంటూ కాళ్ల వేళ్ళబడి బ్రతిమిలాడి ఏడ్చిన లక్ష్మయ్య కనికరం చూపలేదు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అంజలిని సమీపంలో ఉన్న కొందరు ఆటోలో మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రుల్లో చికిత్స జరుపుతుండగా అంజలి మరణించింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో మెయిన్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, లెవలింగ్ పనులు చేపట్టి మౌళిక సౌకర్యాలు కల్పించి ఇళ్ళ నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కల్కక్టరేట్‌లో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్, విద్యుత్ శాఖ అధికారులు, ఏజెన్సీలు, కాంట్రాక్టర్లతో గుంటూరు, తెనాలి, పొన్నూరు పట్టణ పరిధిలో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అర్బన్ మండలాల వారీగా లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాల పనులపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలను సంబంధిత అధికారులందరు సమన్వయంతో పని చేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు తరలించే గ్రావెల్ వాహనాలను ఆపితే పోలీస్ కేసులు నమోదు చేయాలని తహశీల్దార్లకు సూచించారు. కాలనీలలో మెయిన్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, లెవలింగ్ పనులు పూర్తి చేయడంపై అధికారులు దష్టి పెట్టాలన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన లే అవుట్లలో నీరు, విద్యుచ్ఛక్తి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కే.వి.సాయినాథ కుమార్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్.ఈ బ్రహ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భర్తను చూపాలంటూ మహిళ సెర్చ్ పిటీషన్



మాట్లాడుతున్న న్యాయవాది చిలుకా చంద్రశేఖర్

ప్రజాశక్తి -వినుకొండ

అర్ధరాత్రి తన భర్తను తీసుకువెళ్లిన వినుకొండ పోలీసులు నాలుగు రోజులు గడుస్తున్న చూపకపోవడంతో భార్య స్వరమే లక్ష్మి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం సెర్చ్ పిటీషన్ దాఖలు చేశారు. వినుకొండ మండలం జలలపాలెం గ్రామానికి చెందిన సురభి లక్ష్మి తన భర్త వెంకటేశ్వర్లు డిసెంబర్ 27వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో వినుకొండ పోలీసులు తీసుకువెళ్లారని, నాలుగు రోజులుగా పెనుకొండ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగిన చూపకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి సెర్చ్ పిటీషన్ వేశారు. ఏపీ సిఎల్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ వినుకొండ కోర్టులో సెర్చ్ పిటీషన్ వేయగా అడ్వకేట్ కమిషనర్‌గా సిహెచ్‌ఎన్‌ఎల్ మూర్తిని నియమిస్తూ న్యాయమూర్తి పోలీస్ స్టేషన్ సెర్చ్‌కి ఆదేశించడంతో సెర్చ్ చేసినట్లు న్యాయవాది చంద్రశేఖర్ తెలిపారు. సురభి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం 9 గంటలకు అరెస్టు చేసినట్లు మీడియాకు వెల్లడించి రాత్రి 7 గంటలకు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. డిసెంబర్ 27వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సురభి వెంకటేశ్వర్లు వినుకొండ పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకొని ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బంది పెట్టినట్లు తెలిపారు. సురభి వెంకటేశ్వర్లు కొనుగోలు చేసిన భూమి హక్కుల గురించి ఇటీవల హైకోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. గత రాత్రి వినకొండ ఎస్సై, మరికొందరు పోలీసులు కలిసి జాలలపాలెంలోని వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి ఇంట్లో భూమి పత్రాలు తీసుకున్నట్లు తెలిపారు. వినుకొండ పోలీసులు చట్టాన్ని అనుసరించకుండా, ఇతరులను గౌరవించకుండా వ్యవహరించారని, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అక్రమాలకు పాల్పడితే బాధ్యత వహించక తప్పదని ఆయన తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

పట్టణ సిఐ బి. అంకమ్మరావు

ప్రజాశక్తి-మంగళగిరి

నూతన సంవత్సరాన్ని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని , మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ బి. అంకమ్మరావు అన్నారు. నగర ప్రజలకు, పోలీసు సిబ్బంది, అధికారులకు శనివారం ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత, సౌకర్యార్థం కోసం వేడుకల్లో నియమ నిబంధనలు పాటించాలని కోరారు.నగర పరిధిలో ఆయా ముఖ్య కూడళ్లలో ఈరోజు రాత్రి 8గంటల నుంచి జనవరి 1న ఉదయం 4గంటల వరకు మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని బ్రీత్ ఎనలైజర్‌లతో తనిఖీలు నిర్వహిస్తామని, అందువల్ల తాగి వాహనాలు నడపరాదని, పార్టీలకు వెళ్లేవారు తప్పనిసరిగా మద్యం సేవించని వ్యక్తిని డ్రైవింగ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారి వివరాలను ఆధార్ నెంబర్‌తో సహా పాస్‌పోర్టు, వీసా, జాబ్ వెరిఫికేషన్ తదితర వివరాలకు అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇక మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులను మోటారు వాహన చట్టం సెక్షన్ 182, 183 ప్రకారం బాధ్యులను చేస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు సంతోషంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు తగిన భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు నిషేధమని, అసాంఘిక, అసభ్యకర కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.నిర్ణీత సమయానికి మించి బార్ అండ్ రెస్టారెంట్‌లు నిర్వహిస్తే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 80 డిసెబుల్స్ కంటే ఎక్కువ హారన్‌లు, మైకులు ఉపయోగించరాదని, వేడుకల పేరుతో మహిళలు, యువతులను ఈవ్‌టీజింగ్ చేయడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా అవమానకరంగా, అసభ్యకరంగా ప్రవర్తించే వ్యక్తులను, అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకించి యువకులు విచ్చలవిడిగా రోడ్లపై బైక్‌లు నడపడం, స్పీడ్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, డ్రంకన్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్, సైలెన్సర్లు తీసి నడపడం, వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగే చోట బాణాసంచా కాల్చి పొరుగువారికి ఇబ్బంది కలిగించవద్దని తెలిపారు. రోడ్లపై కేక్ కటింగ్స్ చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్, సీటు బెల్టును ధరించాలని, లేకుంటే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని పట్టణ సీఐ బి. అంకమ్మరావు హెచ్చరించారు.

వరిగ సాగుతో అధిక దిగుబడులు

- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల మొగ్గు
- కారెంపూడి మండలంలో 125 ఎకరాలలో వరిగ పంట

ప్రజాశక్తి - కారెంపూడి

వరి సాగులో మిగులు లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్నతో పాటు చిరుధాన్యాల సాగు వైపు రైతులు ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. మండలంలో సుమారు ఐదు వందల ఎకరాల వరకు చిరుధాన్యాల పంట సాగు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిల్లెట్స్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ నుండి కూడా రైతులకు ప్రోత్సాహం లభిస్తోంది. ఖరీఫ్‌లో పత్తి సాగు పూర్తి కాగానే రెండో పంటగా వరిగ తరహా పంటలను సాగు చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మండలంలో 125 ఎకరాలలో వరిగ పంటను రైతులు సాగు చేశారు. ఇప్పటికే మండలంలోని చినకొదమగుండ్లలో 20 ఎకరాలు, పేటసన్నెగళ్ళలో 78 ఎకరాలు,ఒప్పిచర్ల లో 15 ఎకరాలు నరమాలపాడులో 15 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది. ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి పెట్టిన రైతులకు పది నుండి పదిహేను క్వింటాలు దిగుబడి వస్తుంది .రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండటంతో రైతులు వరిగ సాగుకు సన్నద్ధ మయ్యారు.

ముందస్తుగా వేసిన పత్తి పంట పూర్తికావడంతో రెండో పంటగా వరిగను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు పడటంతో పరిస్థితి సానుకూలంగా ఉండటం, సాగర్ కుడి కాలువ నీరు సమృద్ధిగా ఉండటంతో వరిగకు తడులకు ఇబ్బంది లేకపోవడంతో దీనిని సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.



పేటసన్నెగళ్ళలో వరిగ పంట

తక్కువ పెట్టుబడి..



పేటసన్నెగళ్ళ రైతు వెన్ను పులసల వెంకట నారాయణ మాట్లాడుతు 'నేను ఎకరం పొలంలో వరిగ సాగు చేశాను. గత అనుభవాల దృష్ట్యా రెండో పంటగా చిరు ధాన్యాలు సాగును ఎటు వంటి రిస్క్ లేకుండా తక్కువ పెట్టుబడితో పండించే పంటగా అనుభవంలోకి వచ్చింది. ఎకరా వరిగ సాగులో 10 నుంచి 15 క్వింటాళ్లు పండించవచ్చు.

సబ్సిడి ప్రకటించలేదు



వరిగ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఈ ఏడాది ఎలాంటి సబ్సిడి ప్రకటించలేదని ఎఒ యల మందారెడ్డి తెలిపారు. 2023 సంవత్సరాన్ని చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించి యంత్రాలు కూడా ప్రభుత్వమే అందించనున్నట్లు ఆయన తెలిపారు.



కథలు చదివిన పిల్లలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక రజక కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శని వారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భారత అంతరిక్ష విజ్ఞాన పితామహుడు విక్రమ్ సారాబాయి వర్ధంతి సందర్భంగా కథల లోకంలో పిల్లల కార్యక్రమం జరిగిందని జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్య క్షులు డి.బుచ్చిబాబు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిల్లలను ఒక గంట పాటు కథలు చదివించారు. ఇందులో భాగంగ పాఠశాల గ్రంథాలయానికి భాగ్యలక్ష్మి టింబర్ డిపో అధినేత పెరుమాళ సురేష్ సహకారంతో జెవివి ప్రచురించిన 40 రకాల బాలసాహిత్య బొమ్మల కథల పుస్తకాలు బహూకరించారు.ముఖ్య అతిథి సురేష్ మాట్లాడుతూ పిల్లల్లో పఠనాసక్తి కలిగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, ఉపాధ్యాయులు భాస్కర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణి

ప్రజాశక్తి-అచ్చంపేట

ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంపిపి భూక్యా రజనీబాయ్ కృష్ణ నాయక్ అన్నారు. శనివారం అచ్చంపేటలోని సాం ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 80 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ సందెపోగు రత్నబాబు మాట్లాడుతూ విద్యలో పోటీ తత్వం పెంపొందించుకోవాలని, గ్రామానికి, తల్లిదండ్రులకు విద్యార్థులు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవిఎస్ స్వర్ణకుమారి, వైస్ ఎంపిపి జి.నరసింహారెడ్డి టి.నాగరాజు, వైసిపి నాయకులు సిహెచ్ చంద్రయ్య, ఎన్.చంద్రబాబు, ఉపాధ్యాయులు భాస్కర్ ,నాగేంద్ర, రవి, ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి-చిలకలూరిపేట



పట్టణంలోని వ్యాపార సంస్థలు, చిల్లర దుకాణాలు, బార్ అండ్ రెసాట్రెంట్లు నిబంధనలకు అనుగుణంగా సరైన సమయంలో మూసి వేయాలని పట్టణ సిఐ రాజే శ్వరరావు అన్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో శని వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 31 వ తేదీ రాత్రి మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపొద్దని, మైనర్లు,డ్రైవింగ్ లైసెన్సు లేని వారు, బైకుపై త్రిబుల్ రైడింగ్ చేసినా చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల మధ్యలో, బహిరంగ ప్రదేశాలలో డీజే బాక్స్ లు పెట్టొదని , మద్యం సేవించొద్దని అన్నారు. పట్టణ ప్రజలు నిబంధనలకు అనుగుణంగా నూతన సంవత్సర వేడు కలు నిర్వహించుకోవాలని చెప్పారు.



బడ్జెట్ పై చిలకలూరిపేట కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వాగ్వాదం

కౌన్సిల్ సమావేశం .. గందరగోళం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఏడాది ఆఖరున కూడా మార్పులేని కౌన్సిల్ సమావేశం జరిగిందని ఇరుపార్టీల కౌన్సిలర్లు అంటున్నారు. కౌన్సిల్ సమావేశం శనివారం ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ అభ్యంతరం చెప్పడం..అధికార పక్ష కౌన్సిలర్లు కౌంటర్ ఇవ్వడంతో ఇరు వర్గాల కౌన్సిలర్లు వాగ్వాదంతో సమావేశాలు ముగుస్తున్నాయి. అదే తంతు ఈ కౌన్సిల్ సమావేశంలోనూ జరిగింది. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలోని మైలవరపు గుండ య్య కౌన్సిల్ హాల్‌లో బడ్జెట్ పై సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ప్రారంభించక ముందే టిడిపి కౌన్సిలర్లు 'నో' బడ్జెట్... సమస్యలపై చర్చిస్తామని టిడిపి కౌన్సిలర్లు పేర్కొన్నారు. దీనిపై చర్చించక పోవడంతో అధికారుల సైతం గుసగుసలాడుకున్నారు. ప్రధానంగా టిడ్కో, ఆక్రమణల విషయాలపై సవాళ్లు, ప్రతి సవాళ్ళు కొనసాగాయి. దీంతో కౌన్సిల్‌లో గందరగోళ వాతావరణం నెలకొంది. యథావిధిగా చైర్మన్ కౌన్సిల్ సమావేశాన్ని ముగించారు.

5 డిజిటల్ లైబ్రరీలకు రూ.80 లక్షలు విడుదల

ప్రజాశక్తి-రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి రూ.80 లక్షలు విడుదలైనట్లు పంచాయతీరాజ్ ఏఈ పి.శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. గతంలో ఆరు మంజూరు కాగా ఇప్పుడు మరో ఐదు మంజూరయ్యాయని, వీటిలో పాల్వాయి గేటు పసర్లపాడు గోలి మెట్టుగుడిపాడు మల్ల వరంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని అప్పగిస్తే నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు

నీరు, పారిశుద్ధ్యంపై డ్వాక్రా మహిళలకు అవగాహన

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో విప్పర్లలోని ఎస్. టి. కాలనీలో శనివారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహనా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ టిడబ్ల్యు ఎస్ ఎం. నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ ద్వారా దూరప్రాంతాలకు వెళ్ళి నీరు తెచ్చుకునే కష్టాలు ఉండవని అన్నారు. ప్రతి రోజూ ప్రతి వ్యక్తికి 55 లీటర్ల సురక్షితమైన నీటిని అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమన్నారు. అదే



విధంగా నీరు, పారిశుద్ధ్యం పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు, విఎఓ లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 'ధనలక్ష్మి' విద్యార్థి

ప్రజాశక్తి-ఈపూరు



ఈ నెల 29,30వ తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో తమ విద్యార్థి కె దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థి జనవరి 12వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో జరిగే ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో వర్సిటీ జట్టు తరపున పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్,సెక్రెటరీ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఎం.సురేష్, ఆర్ బలరాం నాయక్,ఎం దాసు అభినందించారు.

మాచర్ల ఎంవిఐగా శేషరెడ్డి

ప్రజాశక్తి-రెంటచింతల

మాచర్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా శేషి రెడ్డిని నియమిస్తూ రవాణా శాఖ కమిషనర్ సీతారామాంజనేయులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఒంగోలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటిదాకా ఇక్కడ పని చేసిన కేఎల్ రావు నరసరావుపేట ఎన్ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ అయ్యారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ఫైనల్‌కు బాపట్ల, బేతపూడి టీమ్‌లు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక తూర్పు మాలపల్లిలో శనివారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. ఈ ఆటల పోటీలకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్ సైదా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొత్తం 16 టీమ్ లు పాల్గొనగా ఫైనల్‌కి బాపట్ల, బేత పూడి టీమ్ లు చేరాయి. ఈ టీమ్‌లకు షేక్ జాన్ సైదా ప్రత్యే కంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఫౌం డేషన్ ఆటలను ప్రోత్స హిస్తుందని, ఆటలు ఆరోగ్యకరమని అన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జె.సుబ్బా రావు, సిహెచ్ విఘ్నేశ్వరరెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, షేక్ అబ్దుల్ రవూఫ్, బి వి రెడ్డి, షేక్ కరిముల్లా, ఎం.శేషిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, షేక్ మోహిద్దీన్, బేరింగ్ కాలేషావలి, యుసూబ్, వలి పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

- గుంటూరు-వినుకొండ రహదారి నాలుగు లైన్లుగా విస్తరణ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే లైన్లు, ఇరిగేషన్ కెనాల్స్ ఏర్పాటుకు, విస్తరణకు అవసరమైన భూములు సేకరించి సంబంధిత శాఖలకు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి, నేషనల్ హైవే అథారిటీ అఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌరభ్ సౌరస్యలతో కలసి జిల్లాలో వివిధ జాతీయ, రాష్ట్ర ప్రాజెక్టులకు భూ సేకరణపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినుకొండ- గుంటూరు, గుంటూరు-నిజాంపట్నం హార్బర్ రోడ్డుకు జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నేషనల్ హైవే అథారిటీ అఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌరభ్ సౌరస్య వినుకొండ-గుంటూరు, గుంటూరు-నిజాంపట్నం హార్బర్ రోడ్డు విస్తరణ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలో 91 కి.మీ వినుకొండ - గుంటూరు రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లాలో ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాల్లో 33 కి.మీ, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 52 కి.మీ గుంటూరు, నిజాంపట్నం హార్బర్ రోడ్ గుంటూరు జిల్లాలోని పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో 16 కి.మీ మేర రహదారి విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్ఓ కే. కేంద్ర శేఖరరావు, గుంటూరు ఆర్‌డిఓ ప్రభాకరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిబంధనలకు లోబడి వ్యవహరించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

నూతన సంవత్సర వేడుకలు పోలీస్ నిబంధనలకు లోబడి నిర్వాహకులు వ్యవరించాలని తమ పోలీస్ ఆంక్షల మేరకే వేడుకలు నిర్వహించుకోవాలని తాడేపల్లి సిఐ శేషగిరిరావు తెలిపారు. శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెస్టారెంట్‌లో, బార్‌లో సమయపాలన పాటించాలని కోరారు. 31వ తేదీ అర్ధరాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో డిజె సౌండ్ ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా,సైలెన్సర్ తీసేసి విన్యాసాలు చేసినా, అధిక శబ్దాలు చేసేలా ఏర్పాటు చేసుకున్న వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సరం సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని కోరారు. స్థానికంగా ప్రజలను ఇబ్బందిపెట్టినా, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విలీన గ్రామాల అభివృద్ధికి చర్యలు

నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు - బుడంపాడు చెరువు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో విలీన గ్రామాల అభివద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. శనివారం నగరంలోని 16వ డివిజన్ బుడంపాడులో పర్యటించి, త్రాగు నీటి సరఫరా, ఇతర ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, సదరు సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుడంపాడులో త్రాగు నీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న బూస్టర్ పనులను, రిజర్వాయర్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, బుడంపాడులోనే కాక జిఎంసిలో విలీన గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్దం



చేశామన్నారు. బుడంపాడులో రోడ్లు నిర్మించాలని, అలాగే శ్మశానం అభివద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరగా, రోడ్లు అవసరమైన ప్రాంతాలలో నిర్మించటానికి, శ్మశాన వాటిక అభివద్ధికీ అంచనాలు సిద్దం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గతంలో విలీన గ్రామాలలో అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించక పోవటం వల్ల వలన స్థానికంగా ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం వారి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మిదుర్గ వాసు తదితరులు పాల్గొన్నారు.



జిజిహెచ్‌లో ఎండోస్కోపి ద్వారా శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి గ్యాస్ట్రో ఏంటాలాజీ విభాగం తొలిసారిగా అత్యాధునిక ఖరీదైన ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడారు. పొన్నూరు మండలం పెదపాలెంకు చెందిన బి. అశోక్ కుమార్ రక్తపు వాంతులతో ఈ నెల 12న ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగానికి వచ్చారు. రోగి ఆరోగ్యం ఆందోళనకారంగా ఉండటంతో వైద్యులు మెడికల్ ఐసియులో చేర్పించారు. రోగికి పరీక్షలు చేయగా క్లోమ గ్రంథి ఉబ్బడం వల్ల రక్తపు వాంతులు అయ్యాయని వైద్యులు నిర్ధారించారు. ఈ కేసును గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంకు రిఫర్ చేశారు. ఆ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జగన్ మోహన్, సీనియర్ వైద్యులు డాక్టర్ నాగూర్ బాషా, డాక్టర్ శివ రామకృష్ణలు పరీక్షించి ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్ ద్వారా కాయిల్ గ్లూ ఇంజక్షన్ ఇవ్వాలని నిర్ధారించారు. ఈ నెల 21న రోగికి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఈ చికిత్సకు మత్తు వైద్యులు శైలజ సహకరించారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో శనివారం డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్స ప్రైవేట్ ఆసుపత్రిలో చేయాలంటే మూడు నుంచి నాలుగు లక్షలు ఖర్చు అవుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసినట్లు ఆమె చెప్పారు. వైద్యులు చేసిన కృషిని ఆమె అభినందించారు.

రాజధాని కార్మికులను కొనసాగించాలి

పారిశుధ్యం మెరుగుకుప్రభుత్వం ప్రాధాన్యత నివ్వాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నివ్వాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి కోరారు. ఓ వైపు ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేస్తున్నామని చెబుతూ ఇంకో వైపు పారిశుధ్యం మెరుగుకు పనిచేస్తున్న రాజధాని కార్మికులను జనవరి నుంచి పనిలేదం టూ అధికారులు మాట్లాడటం బాధ్యతా రాహిత్యమన్నారు. శుక్రవారం రాత్రి తుళ్లూరులో పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశంలో రవి మాట్లాడారు. పరిసరాల శుభ్రత..ఆరోగ్యానికి భద్రతని చెబుతూ పారిశుధ్యంను గాలికొదిలేయాలని చూడడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రస్తుతం కరోనా హెచ్చరికల నేపథ్యంలో పారిశుధ్యం విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులను కొనసాగించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జనవరి నుంచి రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులను కొనసాగిస్తామని ప్రభుత్వం తక్షణమే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బలమైన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. తమను పనిలో కొనసాగించాలని, పని భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో కార్మికులు పని విరామ సమయంలో ఆందోళనలు కొనసాగి స్తున్నారని చెప్పారు. సమావేశంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు వీరాంజనేయులు, జ్యోతి, బుజ్జి, కొండమ్మ, శేషయ్య, అంకాల రాజు, ధనలక్ష్మి, ముత్యాలు, రూతమ్మ పాల్గొన్నారు.



అనంతవరం లో పారిశుధ్య కార్మికుల ఆందోళన


తుళ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎం రవి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఎపిఎన్‌జిఒస్ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన సంవత్సరం 2023 క్యాలెండర్ శనివారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంతో సహకరించి పనిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జనవరి 1 నుండి ఉద్యోగులకు ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా అటెండెన్స్ వేయటానికి ఆదేశాలు జారీ అయ్యాయని, ఎఫ్ఆర్ఎస్ విధానానికి ఉద్యోగ సంఘాలకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే యాప్‌లో కొన్ని సవరణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యాప్ ద్వారా తక్షణం వచ్చే సాంకేతిక సమస్యలను సరిచేసి, అప్‌డేట్ చేసినట్లయితే ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు వారి పోస్టుకు మ్యాప్ చేసిన తర్వాత ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ అమలు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డిడి నాయక్, సంయుక్త కార్యదర్శి శ్యాంసుందర్, జి.హరిబాబు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షులు సూరి తదితరులు పాల్గొన్నారు.

చెత్తపన్ను కడితే లోన్లు మంజూరు!

మెప్మా సిబ్బందిని మేపలేకపోతున్నాం : డ్వాక్రా మహిళల ఆవేదన

ప్రజాశక్తి-తాడేపల్లి

చెత్తపన్ను కడితే లోన్ల మంజూరు చేస్తామని తాడేపల్లిలోని డ్వాక్రా మహిళలకు మెప్మా అధికారి హుకుం జారీ చేశారు. ఈ విషయం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. లోన్ జారీ చేయాలంటే లక్షకు ఐదు వేల రూపాయల చొప్పున మామూళ్లు ఇవ్వాలని అల్టిమేటమ్ జారీ చేశారు. ఇన్సూరెన్స్ కూడా కట్టాలని గ్రూపు సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. లోన్ల సంగతేమో గానీ మెప్మా సిబ్బందిని మేపలేకపోతున్నామని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు. చెత్త పన్నుకు లోన్లకు ముడిపెట్టి చుక్కలు చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త పన్ను కట్టకపోతే లోన్లు మంజూరు చేయకపోవడానికి వీళ్లెవరని డ్వాక్రా మహిళలు ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పట్టణంలోని 4,5 వార్డులకు చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులు పూర్తిగా లోన్లు చెల్లించారు. కొత్త లోన్ల మంజూరు కోసం మెప్మా అధికారుల వద్దకు వెళితే, చెత్త పన్ను బకాయిలు చెల్లించినట్లు స్టేటస్ చూపించమని అడుగుతున్నట్లు గ్రూపు సభ్యులు చెబుతున్నారు. గ్రూపులోని సభ్యులందరూ చెత్తపన్ను కడితేనే లోన్ల కోసం తమ వద్దకు రావాలని డ్వాక్రా ఆర్‌పిలకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. కొత్తగా లోన్లు వస్తే లక్షకు ఐదు వేల రూపాయలు, గ్రూపు మొత్తం రూ.50 వేలు ఇవ్వాల్సిందేనని, ఇన్సూరెన్స్ రూ.5 వేలు చెల్లించాల్సిందేనని డ్వాక్రా గ్రూపు సభ్యులు వాపోతున్నారు. డ్వాక్రా మహిళలకు సహాయపడేందుకు ప్రభుత్వం నియమించిన ఆర్‌పిలకు నెలకు రూ. పదివేల జీతం ఇస్తున్నా, తమ వద్ద డబ్బులు వసూలు చేయడమేంటని సభ్యులు వాపోతున్నారు. పాలాభిషేకాలు, సన్మానాలు చేసినప్పుడు కూడా తమ వద్దే డబ్బులు వసూలు చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వం నిర్వహించే సభలకు విధిగా హాజరుకాకపోతే బెదిరింపులు, వేధింపులు తప్పడం లేదని డ్వాక్రా మహిళలు కన్నీటిపర్యంతమవుతున్నారు. లోన్లకు చెత్త పన్నుకు ముడిపెట్టకుండా రుణాలు మంజూరు చేయాలని, లోన్లు ఇచ్చే సందర్భాల్లో బలవంతపు వసూళ్లు నిలవరించాలని, ఇన్సూరెన్స్ వసూళ్లు కూడా నిలుపుదల చేయాలని గ్రూపు సభ్యులు కోరుతున్నారు.



గీతాంజలి స్కూల్‌లో...



గీతమ్స్ హైస్కూల్‌లో...

విద్యాసంస్థల్లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక గీతాంజలి స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ తెళ్ళ కృష్ణవేణి చిన్నారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్నారులు గడచిన సంవత్సరంలో ని చెడును వదిలివేసి మంచిని మాత్రమే తీసుకొని ఈ నూతన సంవత్సరంలో మంచి ఆరోగ్యం మంచి చదువుతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీతమ్స్ లో ..

స్థానిక గీతమ్స్ హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరస్పాండెంట్ మాలపాటికోటిరెడ్డి హాజరయ్యారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల సభలో విద్యార్థినీ విద్యార్థులు కేకును కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం 2023 రంగవల్లికను వేసి అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరం అందరి జీవితాలలో ఆనందాన్ని నింపాలని , విద్యార్థిని విద్యార్థులు అందరూ శ్రద్ధగా చదువుకొని ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం. కృష్ణవేణి , ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలో పసుమర్తి లోని శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ లో శనివారం పుస్తకాలు పంపిణీ చేశామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ యాసిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వి అప్పారావు, డి.పద్మావతి, ఎన్.శంకరరావు, బి.వరప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.



మండల, గ్రామ రెవెన్యూ అధికారుల ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మండలం, గ్రామ రెవెన్యూ అధికారుల ఎన్నిక జరిగిందని సంఘ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహంకాళి సాంబశివరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,జిల్లా డివిజన్ రాష్ట్ర కార్యవర్గం యొక్క ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉపాధ్యక్షులుగా తుళ్లూరు చెంచయ్య,సెక్రటరీగా పిల్లి బాబురావు, సంయుక్త కార్యదర్శిగా గబ్బటి లలిత సూర్య తేజస్విని, కోశాధికారిగా కొమ్మినేని సుభాషిణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలకు నాంది

ప్రజాశక్తి-రెంటచింతల

విద్యావ్యవస్థలో సంస్కరణలకు వైసిపి ప్రభుత్వం నాంది పలికిందని, అందులో భాగంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు ఎంపిపి దాసరి చౌడేశ్వరి తెలిపారు. శనివారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 36 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటివరకు 574 ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకలకు అనుమతుల్లేవు: అర్బన్ సిఐ

ప్రజాశక్తి-మాచర్ల



పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుం పులు గుంపులుగా చేరి నూతన సంవత్సర వేడుకలు జరుపుకు నేందుకు అనుమతులు లేవని పట్టణ సిఐ బాలక్రిష్ణ తెలిపారు. గత నెల డిసెం బర్ 16వ తేదీన మాచర్ల లో టిడిపి, వైసిపి పార్టీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు పార్టీలకు చెందిన పలువురు తీవ్రగాయాలకు గురి కావటం, తెలుగుదేశం పార్టీ కార్యాలయం దగ్ధం చేయ డం, టిడిపి నాయకులకు చెందిన పలు వాహనాలు దగ్ధం కావడం, టిడిపినాయకుల ఇళ్ళు ధ్వంసం అయిన సం ఘటన జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ప్రశాంత వాతావారణం కోసం పట్ట ణంలో 144 సెక్షన్ అమల్లో ఉంది. తాజా 144 సెక్షన్‌ను జనవరి 5 వరకు తహ శీల్దార్ పొడిగించారు. ఈ నేపథ్యంలో సెక్షన్ 144 అమల్లో ఉన్నందున నూతన సంవత్సర వేడుకలపైనా అంక్షలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

విద్యుత్‌కాంతులీనుతున్న చర్చిలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్



నూతన సంవత్సరం-2023ను పురస్కరించుకుని పట్టణంలోని పలు చర్చిలు విద్యుత్ దీపాలతో మెరిసి పోయాయి.. సియోను లూథ రన్ , సెంటనరి బంటిస్ట్ చర్చ .తెలుగు బాప్టిస్ట్ చర్చిలను సుందరంగా అలంకరించారు.



పసుమర్రులో 'పొలంబడి'శిక్షణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని పసుమరులో గ్రామ వ్యవసాయ సహాయకులకు పొలం బడి కార్యక్రమం నిర్వహణ నిమిత్తం శిక్షణ ఇచ్చినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీ లత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి లో జిల్లా వనరుల కేంద్రం శిక్షణ కోఆర్డి నేటర్ ఎం. శివ కుమారి శనగ పంటలో అక్క డక్కడ వేరుకుళ్ళు, శనగ పచ్చ పురుగును గమనించి వీటి ఉధృతి చాలా తక్కువగా ఉన్నందున ఎలాంటి మందులు వాడవలసిన అవసరం లేదని తెలియజేశా రన్నారు. నరసరావుపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ ఈ- పంట నమోదు ఆవశ్యకత గురించి వివరించారు. పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, ఇతర రాయితీలు రావాలంటే ఈ పంట నమోదు తప్పనిసరని చెప్పారని వివరించారు. పొలంబడిలో గ్రామ వ్యవసాయ సహాయకులు వివిధ బృందాలుగా ఏర్పడి పొలం పరిసరాల విశ్లేషణ చేసి తూనీగలు, అక్షింతల పురుగులు మొదలై నటువంటి మిత్ర పురుగులు ఉండడం, చీడ పీడలు చాలా తక్కువగా ఉండటం వల్ల ఎలాంటి పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని నిర్ణయించారన్నారు.



కేలెండర్ ఆవిష్కరిస్తున్న ఉర్దూ డిఐ, ఉపాధ్యాయులు

ఎపిజిటిఎ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండి. ఖాసిం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచటానికి కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అదే విధంగా తమ న్యాయమైన హక్కుల కోసం కలిసి కట్టుగా పనిచేసి, ప్రభుత్వ సహకారంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సుధారాణి, సామ్రాజ్యం, ఎండి.ఆరిఫ్, షబీనా పర్వీన్, రాజ్యలక్ష్మియ, యల్లమందరావు తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలోని నరసరావుపేట సెంటర్, విజయబ్యాంక్ సెంటర్లలో ఉన్న ఫ్లెక్సీలు

జాగా కనిపిస్తే ఫ్లెక్సీలే!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నాయకుల గుర్తింపు కోసం చోటా నాయకులు, అభిమానులు, కార్యర్యకర్తలు 'నువ్వా..నేనా' అని పోటీ పడుతున్నారు. నిబంధనలు, పద్ధతులను సైతం లెక్క చేయకుండా చిలకలూరిపేట పట్ట ణం లో, జాతీయ రహదారి పొడవునా ప్రముఖుల ఫ్లెక్సీ లతో నింపేసు _న్నారు. నూతన సంవత్స రాన్ని పుర స్కరించుకొని అభిమానులు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు జాతీయ రహదారి ప్రధాన కూడళ్లు, పట్ట ణం గుండా వెళ్లే జాతీయ రహదారి పొడవునా, అటు గణపవరం సెంటర్ మొదలు ప్రధాన కూడళ్ళు ఎన్నార్టీ సెంటర్, విజయ బ్యాంక్ సెంటర్, అడ్డ రోడ్డు సెంటర్లలో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద హోర్డింగ్‌లు, కటౌట్లు దర్శన మిస్తున్నాయి. అధికార వైసిపి, ప్రతి పక్ష టిడిపి, జనసేన,కాంగ్రెస్ పార్టీల, మాజీ ఎమ్మెల్యే శేఖర్‌ల ఫ్లెక్సీలతో పాటు ఇతర ఫ్లెక్సీలను చూస్తుంటే జాతీయ రహ దారిని పొగ మంచు కప్పినట్టుగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. స్థానిక కళామందిర్ సెంటర్ నుండి అడ్డ రోడ్డు వరకు,ఒంగోలు బ్రిడ్జి నుంచి గుంటూరు వైపు, నియోజ కవర్గ పరి ధిలో డివైడర్ పై అభిమానుల హోర్డింగులే దర్శన మిస్తున్నాయి. ఈ విషయమై సిఐ టియు జిల్లా ఉపాధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు, వాహనదారులు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.



స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలు

ప్రజాశక్తి-మాచర్ల

భారతదేశ కీర్తి, ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక కిడ్స్ పాఠశాల ఆవరణలో శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని 160వ జయంతి వారోత్స వాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి స్వామి వివే కానందుని చరిత్ర పట్ల పూర్తి అవగాహన ఉండా లన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నైతిక విలువలతో ముం దుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ చినలాల్‌సాహెబ్, హెచ్‌ఎం శ్రాస్తి తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సందర్శించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

ప్రజాశక్తి -మంగళగిరి

పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని శనివారం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా సందర్శించారు. తొలుత దేవస్థాన అధికారులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కు ఆలయం మర్యాదలతో ఘన స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించగా అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎ. రామకోటి రెడ్డి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అర్హులైన లబ్దిదారులకు నేడు పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి మున్సిపల్ పరిధిలో నూతనంగా మంజూరు అయిన 495 పెన్షన్లను అర్హులైన లబ్దిదారులకు ఆదివారం అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం జస్వంతరావు శనివారం తన కార్యాలయంలో వెల్లడించారు. కొత్తపేట రామకృష్ణకవి కళాక్షేత్రంలో మధ్యాహ్నం 12:30 గంటలకు నిర్వహించబోయే కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జిల్లా కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేద నసీమ్, వైస్ చైర్మన్లు మలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. కౌన్సిల్, కో-ఆప్షన్ సభ్యులు, వాలంటీర్లు సచీవాలయా సిబ్బంది విదిగా హాజరవ్వాలని ఆదేశించారు.



నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం గోలమూడిపాడు గ్రామంలో అమరావతి సీడ్స్ షాపు యజమాని పెరుగు రాంబాబు గ్రామంలోని చిల్డ్రన్స్ హోమ్‌కు రూ. 50వేలు నిత్యావసర సరుకులు అందజేత తన దాతృత్వాన్ని చాటుకున్నారు. శనివారం పొన్నూరు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ చేతుల మీదుగా బ్రాహ్మణ కోడూరు గ్రామంలో ఉన్న చిల్డ్రన్స్ హెూమ్‌లో సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ కేదార్నాథ్ బాలికల మధ్య కేక్ కట్ చేసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. రాంబాబును తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరుచూరి రాజ్యలక్ష్మి, స్థానిక విఆర్ఓ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎస్‌టియు క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కెనడి

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి, పెదనందిపాడు: (కాకుమాను)

రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ), కాకుమాను మండల శాఖ ఆధ్వర్యంలో 2023 ఎస్‌టియు డైరీ, క్యాలెండర్లను కాకుమాను మండల విద్యాశాఖ అధికారి కెఎఫ్ కెనడీ శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా కార్యదర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 75ఏళ్లుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాడుతూ ప్రభుత్వ పాఠశాల పరిరక్షణకు, ఉపాధ్యాయ సంక్షేమానికి, విద్యార్థుల సమగ్ర అబివృద్ధికి ఎస్టీయు విశేష కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయు గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, కాకుమాను మండల శాఖ అధ్యక్షులు జొన్నకూటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కాంద్రు సద్గుణరావు. ఎస్ టి యు నాయకులు పీ పోతురాజు, శంకర్ పాల్గొన్నారు.

పోలీస్ ఫైరింగ్ రేంజ్ పరిశీలన


ఫైరింగ్ రేంజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ , ఎస్‌పి

ప్రజాశక్తి- మేడికొండూరు.

మండలంలోని పేరేచర్ల కైలాసగిరి సమీపంలోని పోలీస్ రేంజ్ ఫైరింగ్ ప్రాంతాన్ని శనివారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ ఆఫీస్ హాఫీజ్‌లు పరిశీలించారు. ఫైరింగ్ శిక్షణలో భాగంగా పోలీస్ వ్యవస్థలో ఉన్న అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించి ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ప్రతి ఏడాదికి ఒకసారి ఇక్కడ ఈ ఫైరింగ్ తర్ఫీదు జరుగుతుంది. ప్రతి గన్నును పరిశీలించి దానిలో బుల్లెట్లను లోడ్ చేసి ఫైరింగ్ చేశారు. అన్ని రకాల మోడల్ తుపాకులను ఇక్కడకు తీసుకువచ్చి ఫైరింగ్‌లో వినియోగించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు అదనపు ఎస్పీలు, డిఎస్పీలు ,సిఐలు ,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులే కీలకం

ప్రజాశక్తి- దుగ్గిరాల

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటానికి పారిశుద్ధ కార్మికులు, క్లాప్ మిత్రల పాత్ర ప్రధానమైనదని ఎంపీడీవో కుసుమ శ్రీదేవి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నూతన సంవత్సరం శు భాకాంక్షలు తెలుపుతూ పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు, క్లాప్ మిత్రులకు సచివాలయ సిబ్బందికి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో దుగ్గిరాల ఈమని గ్రామాలు మోడల్ విలేజెస్‌గా ప్రకటించి ఉన్నారని తెలిపారు. గ్రామాలలో రోడ్లన్నీ విజువల్ టీం లీడర్‌గా తీర్చిదిద్దటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ప్రధానమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఏఎస్ రామలింగేశ్వరరావు, బాణావత్ వెంకటేశ్వర నాయక్, గాలం ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు


కార్మికులకు స్వీట్లు పంచుతున్న ఎంపిడిఓ కుసుమ

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి విడనాడి రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని ప్రకటించాలని రైతులు, మహిళలు డిమాండ్ చేశారు. శనివారంతో రాజధాని రైతుల దీక్షలు 1110వ రోజుకు చేరాయి. తుళ్లూరు, వెలగపూడి,వెంకటపాలెం,నెక్కల్లు తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు కొనసాగుతున్నాయి .అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి, ఒకే రాష్ట్రం ఒకే రాజధానంటూ నినాదాలు చేశారు.


కె. నరసింహారావు (ఫైల్)

గుండెపోటుతో రైతు మృతి..

రాజధానిలోని మందడం శివారు గ్రామం తాళ్లాయపాలెంకు చెందిన రైతు కొండెపాటి నరసింహారావు(47)శు క్రవారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. రాజధాని నిర్మాణానికి 2.5 ఎకరాల భూమిని ఇచ్చిన నరసింహారావు అమరావతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్నారు.ప్రభుత్వం అమరావతి రాజధానిపై అనుసరిస్తున్న వైఖరిపై మనస్తాపం చెంది గుండె పోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, శారీరక శ్రమ వంటి జీవనశైలిని అలవర్చుకుంటే మంచి ఆరోగ్యం పొందవచ్చునని కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయ సలహాదారు, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. శనివారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నిర్ణీత సమయంలో ఆహారం, నిద్ర, వ్యాయామం, మానసిక ప్రశాంతతకు యోగా వంటివి అలవరుచుకోవాలని సలహాదారు, విద్యార్థివ్యవహారాల డీన్ డాక్టర్ హబీబుల్లాఖాన్ సూచించారు. దుహిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, షైన్ మల్టీస్పెషల్టి హాస్పిటల్, అమరావతి ఐ హాస్పిటల్ వారు ఏర్పటు చేసిన వైద్య శిబిరంలో విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు సిబ్బంది , విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం మందులు అందజేశారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ నల్లూరి శశిధర్, డాక్టర్ వికాస్ కాట్రగడ్డ, డాక్టర్ వి. మధుకిరణ్, డాక్టర్ వేణు నాదెండ్ల వారి టెక్నీషియన్లు ఎండి. షంషుద్దీన్ దంతాలు, ఎముకలు, నరములు, ఊపిరితిత్తులు, మధుమేహం, రక్తపోటు, కళ్ళుతో పాటు అన్ని సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి వైద్య సేవలు అందజేసినట్లు విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూతు రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి, సమన్వయకర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -తెనాలి

ప్రజా రవానాలో మెరుగైన సేవలందిస్తున్న ఆర్‌టిసిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలి ఆర్‌టిసి డిపోకు నూతనంగా కేటాయించిన రెండు పల్లెవెలుగు సర్వీసులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాకు ఉపయోగపడే ఆర్‌టిసి బస్సుల పెంపులో భాగంగా డిపోలకు కొత్త సర్వీసులను ప్రభుత్వం కేటాయించిందని, దానిలో భాగంగానే తెనాలి డిపోకు కూడా రెండు పల్లెవెలుగు సర్వీసులు వచ్చాయన్నారు. ప్రజలు ఆర్‌టిసి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది, వివిద యూనియన్ల నాయకులు పాల్గొన్నారు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి -ఫిరంగిపురం


ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ ఎమ్మెల్యే, వైసిపి అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి నియోజక వర్గ ప్రజలకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. 2023 ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, మీ అందరికి మంచి జరగాలని నూతన సంవత్సరం సందర్భంగా ఆకాంక్షిస్తున్న అన్నారు. నూతన స్ఫూర్తితో 2023లో కూడా అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేసి, ప్రజలకు మెరుగైన పాలన అందించే లక్ష్యంగా పని చేస్తానన్నారు.



వంటకాలను సిద్ధం చేస్తున్న యాజమాన్యం

నూతన సంవత్సరానికి రుచికరమైన వంటలు

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఆటో నగర్‌లో గల ఆల్ఫా అరేబియన్ రెస్టారెంట్ అన్ని రకాల వంటకాలను నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం చేసినట్లుగా రెస్టారెంట్ యజమాని శంషుద్దీన్ తెలిపారు. ఆరు బయట వంటకాలతో ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. మంగళగిరి పరిసర ప్రాంతాల్లోనే ఉన్న భోజన ప్రియులకు వివిధ వంటకాలు చేస్తూ మెప్పు పొందుతున్నట్లు చెప్పారు. చికెన్, మటన్ దమ్ బిర్యానీలు, అనేక రకాల రుచికరమైన వంటకాలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు.



సుమేధా హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆరంజ్ కలర్ దుస్తులతో ఆకట్టుకున్నారు. కమల పండు విశిష్టత, ఔషధ గుణాలను విద్యార్థులకు వివరించారు. క్యాక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



కెఎల్‌పి స్కూల్లో ...

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిబి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ప్రసంగించారు. విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి కొత్త సంవత్సరంలో సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు.2023 సంవత్సరంలో విద్యార్థులు కష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని, వాటిని సాధించేందుకు పట్టుదలతో కషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు.కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, లారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక ద్రోహి మోడీ

- సిఐటియు కార్మిక చైతన్య జాతాలో నాయకులు
- గుంటూరు, పల్నాడు జిల్లాలో జాతాకు ఘన స్వాగతం

కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకపోగా, ఉన్న హక్కులను కాలరాస్తుందని సిఐటియు రాష్ట్ర నేతలు విమర్శించారు. మరోవైపు రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి, మోడీ విధానాలకు అడుగులకు మడుగులు వత్తుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తు న్నాడని అన్నారు. ఈనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో నిర్వహిస్తున్న సిఐటియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ హిందూపురం నుండి బీమవరం వరకూ చేపట్టిన కార్మిక చైతన్య జాతా శనివారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రచారం నిర్వహించింది.



గుంటూరు జిల్లా జాతాలో మాట్లాడుతున్న స్వరూపరాణి



పల్నాడుజిల్లా నరసరావుపేటలో జాతాకు స్వాగతం చెబుతున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో సిఐటియు నాయకులు, కోల్డ్ స్టోరేజి, టింబర్ ముఠా కార్మికులు, మెడికల్ రిప్స్, ఎల్ఐసి, పోస్టల్, బ్యాంకు ఉద్యోగులు, వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతాకు ఘనస్వాగతం పలికారు. నాయకులపై పూలమాలలు జల్లి రెడ్ సెల్యూట్ చెప్పారు. యాత్రకు స్వాగతం పలికి చుట్టుగుంట నుండి మార్కెట్ సెంటర్ వరకూ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు బి.ముత్యాలరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు.

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా, నరసరావుపేట,వినుకొండ

ప్రచార జాతయాత్ర శనివారం పల్నాడు జిల్లా వినుకొండ నుండి, జిల్లా కేంద్రం నరసరావుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రచార జాతకు సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ ఘన స్వాగతం పలికారు. బహిరంగ సభా ప్రాంగణం వద్ద ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు.స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి చిత్రాలయ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా గుంటూరు, నరసరావుపేటలో జరిగిన బహిరంగ సభల్లో నాయకులు ప్రసంగించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలు సవరించి, లేబర్ కోడ్‌లు రూపొందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఆయా విధానాలు అమలు చేయటానికి తిరుపతిలో కేంద్ర, మంత్రులు, అధికారులతో సమావేశం నిర్వహించిందన్నారు. మోడీ 8 ఏళ్లలో కార్మికుల గురించి పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కార్మిక శాఖ మంత్రికి కార్మిక సంక్షేమం పట్టదని, భూ కబ్జాలలో మునిగిపోయారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల వాగ్ధానాలు తుంగలో తొక్కారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు రెండేళ్లుగా పోరాడుతుంటే మోడీ ప్రభుత్వం అమ్మి తీరుతామని ప్రకటించటం అన్యాయమన్నారు. రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ రూపొందించటం ద్వారా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తున్నారన్నారు. 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు పెంచాలని, సంఘాలు పెట్టుకోటం, కార్మికుల డిమాండ్లపై సంప్రదింపులు చేయటం వంటి హక్కులు లేకుండా సవరణ చేశారన్నారు. మరోవైపు మోడీ విధానాలకు జగన్మోహన్‌రెడ్డి తలూపుతున్నాడన్నారు. రాష్ట్రంలో గత 18 సంవత్సరాలుగా 60 రకాల షెడ్యూళ్ల పరిశ్రమల్లో పనిచేస్తున్న లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు దక్కట్లేదన్నారు. గత ప్రభుత్వంగానీ, ప్రస్తుత ప్రభుత్వంగానీ కనీస వేతన సలహా బోర్డు ఏర్పాటు చేయకపోవటం వల్లే కార్మికులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. మరోవైపు కేరళలో అన్‌స్కిల్డ్ కార్మికుడికి రోజుకి రూ.950లు, కర్నాటకలో నెలకు రూ.18వేలు కనీస వేతనం అందుతుందని, ఎపిలో మాత్రం రూ.10వేలకు మించి లేదన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన వాగ్ధానం వమ్ము చేశారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై మడమ తిప్పారన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా బీమ వరంలో మొదటి రోజు జరిగే ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగులు వేలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గుంటూరుకార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు సిహెచ్.కుమార్, వివికె.సురేష్, రామకృష్ణ, గోవిందు, నళినీకాంత్, కె.శ్రీనివాసరావు, ఖాసింవలి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారుల బృందం ఆలపించిన కార్మిక చైతన్య గీతాలు ఆలోచింప చేశాయి.

పల్నాడు జిల్లా నరసరావుపేట కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయ కుమార్, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి హనుమంత రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు హరి పోతురాజు, రవిబాబు, సిఐటియు మండల కార్యదర్శి ఈవూరి మస్తాన్ రెడ్డి,సహాయ కార్యదర్శిలు సిలార్ మసూద్, మల్లీశ్వరి, టి శ్రీను, ప్రజా సంఘాల నాయకులు టి. పెద్దిరాజు వై రాధాకష్ణ, అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, ఏపూరి గోపాలరావు, కామినేని రామారావు, కోంద్రు ఆంజనేయులు, రబ్బానీ, హుస్సేన్, మస్తాన్ వలి, జిలాని మాలిక్ సరికొండ వెంకటేశ్వర రాజు, తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల గేయాలాపన



లీలాభాయ్ భర్త లాస్కర్ నాయక్ కు చెక్కు అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు



జాతాకు వినతి పత్రం ఇస్తున్న రాజధాని పారిశుధ్య కార్మికులు, నాయకులు

శ్రామిక మహిళా సమన్వయ కమిటీ వితరణ

నరసరావుపేట : శ్రామిక మహిళా సమన్వయ కమిటీ పల్నాడు జిల్లా కోశాధికారి డి.శివకుమారి మాట్లాడుతూ మాచర్ల మండలం కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనిచేస్తున్న అనుపుకు చెందిన ఆశా కార్యకర్త లీలా బాయ్ ని దుండగులు అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేశారని శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో చేసిన పోరాటంతో ఆమె కుటుంబానికి కొంత భూమి ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమెకు 6 గురు కుమార్తెలు కాగా ముగ్గురుకి వివాహాలు కాగా మరో ముగ్గురు కుమార్తెలు ఆమె భర్త ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలో శ్రామిక మహిళ సమన్వయ గుంటూరు పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన రూ .25 వేలు చెక్కును లీలా భర్త లస్కర్ నాయక్ కు సిఐటియు రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శివ కుమారి మాట్లాడుతూ లీలా భాయ్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతాకు పారిశుధ్య కార్మికులు వినతి

మంగళగిరి : మంగళగిరిలో కార్మిక చైతన్య యాత్రకు సిఐటియు నాయకులు, కార్మికులు, స్కీం వర్కర్లు ఘన స్వాగతం పలికారు. ప్రచార యాత్ర రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ రామ్మోహనరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర బృందానికి ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, రాజధాని ఏరియా పారిశుధ్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ, కార్యదర్శి బి లక్ష్మణరావు, మంగళగిరి సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, నాయకులు జెవి రాఘవులు, వై కమలాకర్, టి శ్రీరాములు, వివి జవహర్లాల్, రాజధాని కమిటీ సిఐటియు నాయకులు ఎం రవి, ఎం భాగ్యరాజు, ఆర్ వేణు, వివిధ కార్మిక సంఘాల నాయకులు షేక్ జానీ భాష, టి శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు స్వర్ణలత, నజియా, కుమారి, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం బాలాజీ, ఎస్ గణేష్, జె నవీన్ ప్రకాష్ పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో లో మాట్లాడుతున్న నరసింహారావు